క్లుప్తంగా

సిబ్బంది సమయం పాటించాలి

చిట్వేలి : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయం పాటించాలని ఎంపీడీఓ రంగారావు సూచించారు. గురువారం నాగవరం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలనతోపాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం దళితవాడ గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు సోక రామచంద్రయ్య వివాహానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీ నరసింహులు, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, ఉమాశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి 'ఇన్‌స్పైర్'కు ఎంపిక

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులు సైన్స్‌తో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయిలో రాయచోటి డైట్ కాలేజీలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో పదోతరగతి విద్యార్థి తరుణ్ కుమార్ చేసిన బయో టాయిలెట్ ద్వారా ప్రకృతి స్నేహితమైన పద్ధతి మానవుల మలమూత్రం వలన కలిగే కాలుష్యాన్ని నివారించే విధానాన్ని గురించి తెలిపే ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. గురువారం విద్యార్థి తరుణ్ కుమార్‌కు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో గైడ్, బయాలజీ ఉపాధ్యాయులు విజయ, వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, రాజ్‌కుమార్, సుధాకర్, నిత్య పూజయ్య, విజయకుమారి, శ్రీకళ, సుజాతమ్మ, జమ్రూద్ బేగం, శ్రీనివాసులు, ప్రసాద్, భారతి, అరుణకుమారి, రాజేశ్వరీ, ఉమ, రసూల్, సుధీర్, పీడీ సోమశేఖర్ నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఇంద్రాణి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల తహసీల్దార్‌గా సీహెచ్ ఇంద్రాణి బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు జిల్లా కలెక్టరేట్ నుంచి పెనగలూరుకు బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఎన్నికలను సజావుగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. సంవత్సరాలుగా రోడ్డు కోసం భద్రవాతి నగర్ త్యాగరాజు కాలనీ, అయ్యలరాజుపల్లె బీసీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో దాదాపు రూ.19 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ జి.దుర్గా ప్రసాద్ సర్పంచ్ ఆళ్ల ఈశ్వరయ్య, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వార్డు మెంబర్ సుబ్బరాయుడు, నాయకులు చొప్పా గంగిరెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, బి.సుబ్బన్న డాక్టర్ ఉపేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

రామాపురం : మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎండీ అఫ్రోజ్ బేగం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు పెంపు దోహదం చేస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే వర్షాలు సమయానికి పడి రైతులను ఆదుకుంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ చిన్న రెడ్డప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటలతో లాభాలు

పుల్లంపేట : అంతర పంటలు సాగు చేయడం వలన అధిక లాభాలు పొందవచ్చని మండల పరిధిలోని అనంతంపల్లె రైతన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అరటి సాగు చేసి అంతర పంటగా చామంతిని కూడా సాగు చేశామని, ప్రస్తుతం చామంతి పూలు కిలో రూ. 30లు పలుకుతోందని తద్వారా తాము మంచి ఆదాయాలు గడిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే అంతర పంటగా చామంతిని సాగు చేయడం వలన అరటిలో చీడపీడలు తొలగిపోతున్నాయని వారు తెలియజేశారు.

సమ్మెకు ఉద్యోగులు దూరం

ఓబులవారిపల్లె : నేడు శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెకు ఏపీఎండీసీ పునరావాస ఉద్యోగులు దూరంగా ఉన్నట్లు పునరావాస ఉద్యోగ సంఘ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎండీసీలో ప్రతిరోజూ లాగే యథావిధిగా విధులకు హాజరవుతామని, సమ్మెకు తాము మద్దతు ఇవ్వడం లేదని వారు స్పష్టం చేశారు.

చిరస్మరణీయుడు, రేనాటి వీరుడు వడ్డెర ఓబన్న



వైఎస్సార్ ఆసరా సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ కొరముట్ల శ్రీనివాసులు



వడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

- కోడూరు పట్టణంలో వడ్డెర ఓబన్న విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : దేశ ప్రజలకు, వడ్డెరలకు చిరస్మరణీయుడు, స్వాతంత్య్ర సమరయోధుడు రేనాటి వీరుడు వడ్డె ఓబన్న అని, ప్రతి ఒక్కరం ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో వడ్డెర సంఘాల ఆధ్వర్యంలో స్థాపించిన స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధులను ప్రతి ఒక్కరం గుర్తు పెట్టుకొని వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రైల్వే కోడూరులోని వడ్డెర నాయకులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఆయన్ను చూసినప్పుడల్లా ఆయన త్యాగాలు, స్వాతంత్య్రం కోసం చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తాయన్నారు. నేటి యువకులకు దేశభక్తి పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. రైల్వేకోడూరు పట్టణంలో ఎక్కడా లేని విధంగా ఆదర్శప్రాయులు, స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ప్రతి ఒక్కరం త్యాగ ధనులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు ప్రభుత్వ విప్ కొరముట్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, బీసీ మానిటరింగ్ సభ్యులు బత్తల సుబ్రమణ్యం, నాయకులు కుంచాల సుధాకర్, కెవి రమణ, బత్తల చంద్రమౌళి, లక్ష్మయ్య, సుబ్బరాయుడు, రెడ్డయ్య, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సభా ఏర్పాట్ల పరిశీలన

రైల్వేకోడూరు : కోడూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నూతన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లీనిక్‌లు అలాగే వైఎస్సార్ ఆసరా – 4 విడత వారోత్సవాలను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నేడు (శుక్రవారం) ప్రారంభించనున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఎంపీడీఓ ప్రాంగణంలో జరిగే సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కేవలం నాలుగు సంవత్సరాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిని ప్రజలకు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, సుధాకర్ రాజు, ఉప సర్పంచ్ శివసాయి, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము చంద్రబాబుకు లేదు
- టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీకి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్‌నాథరెడ్డి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలన ముందు వచ్చే ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని చంద్రబాబునాయుడు ఒంటరిగా పోటీ చేయలేక పొత్తుల కోసం, స్టార్ క్యాంపెయినర్ల కోసం వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల 80 శాతం మంది ప్రజలకు లబ్ధి చేకూరి వారి జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు. జగన్ మరోమారు సీఎం అయితేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అంది, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కారణంగానే రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కరోనా ప్రపంచాన్నే వణికించిందని, అలాంటి పరిస్థితుల్లో జగన్ ఏమాత్రం వెరవకుండా రాష్ట్ర ప్రజలను కాపాడుకున్నారని తెలిపారు. అలాంటి నాయకుడు సీఎంగా ఉంటేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కరోనా సమయంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ఇంటి నుంచి అడుగు బయటపెట్టలేదని విమర్శించారు. అలాంటి నాయకులు ప్రజలకు ఏమి చేయగలరని ఆకేపాటి ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నికలకు సమయం ఆసన్నం కావడంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తోడు దొంగల్లా మాయ మాటలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి సమపాళ్లల్లో సాగుతుందని ఇలాంటి తరుణంలో ప్రజలు ఏమాత్రం పొరపాటు చేయవద్దని తెలియజేశారు. ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డే రమణ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పోలి మురళీరెడ్డి, వివిధ విభాగాల కన్వీనర్లు ఎస్.ఈశ్వరయ్య, ఎస్.షామీర్‌బాషా, ముజఫర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

రానున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి వైఎస్సార్‌సీపీ శుక్రవారం నుంచి ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టనుంది. పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలాతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. అలాగే అన్ని వార్డుల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జ్‌లు ప్రచార పర్వాన్ని ప్రారంభించనున్నారు.

ఆకేపాటిని మెజార్టీతో గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న భూమన శివశంకర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్ రెడ్డి అన్నారు. శనివారం నందలూరు పంచాయతీలోని దుర్గాపురం ఎస్టీ కాలనీలో ఆకేపాటి అమరనాథరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలనను మరోసారి తెచ్చుకునేందుకు ప్రజలందరూ సన్నద్ధం కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాజంపేట వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా నిలబడనున్న ఆకేపాటి అమరనాథరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమం అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి వారు మరొకరు లేరని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, విద్యార్థులు, యువత, మైనార్టీలు, బీసీలు, ఎస్టీలు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో తిరుపతి చలపతి, ఇమిడి సుబ్రమణ్యం, చిన్న చలపతి, పెద్దన్న, వెంకటరమణ, బుడికి వెంకటరమణ, తిరుపతి వెంకటయ్యలు పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్రం

సంబేపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఫౌండేషన్ స్కూళ్లను గుర్తిస్తున్నట్లు కేంద్ర బృందం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గున్నికుంట్లలోని చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా గుర్తించినట్లు వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 పాఠశాలలను గుర్తిస్తున్నట్లు తెలియజేశారు. ప్రాథమిక పాఠశాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదర్శ ఫౌండేషన్ స్కూళ్ల ద్వారా ప్రీ స్కూల్ పిల్లలకు అదనపు వసతులను కల్పించి మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా మార్చేలా పనులు చేపడతామన్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, ఏఏఎంఓ షమీరుల్లా, చౌటపల్లి అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆజం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

రాయచోటి అర్బన్ : 2023 మార్చి మాసంలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లుగా పనిచేసిన వారికి చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ కంటిజెన్సీ చెల్లింపులో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు అన్నారు. సమస్యను పరిష్కరించాలంటూ గురువారం వారు డీఈఓ శివప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో జరిగిన మూల్యాంకన విధుల్లో పాల్గొన్న చీఫ్, అసిస్టెంట్ ఎగ్జామినేషర్లు, ఎగ్జామినేషనర్‌లు, స్పెషల్ అసిస్టెంట్‌లకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్, డీఏల చెల్లింపులో అలసత్వం వహించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో మార్చి నెలలో జరిగే పరీక్షల విధులను బహిష్కరించవలసి వస్తుందంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు శ్రీధర్‌రెడ్డి, దావూద్, రాజారమేష్, నాగార్జున, చంద్రశేఖరరెడ్డి, శశికిరణ్ పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట రూరల్ : మండలంలోని జవహర్ నవోదయ విద్యార్థులకు గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పథకం ఉప సంచాలకులు పి.పద్మలత మట్టి నమూనాల సేకరణ, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యవసాయ పంటల సాగు భూములకు 15 సెంటీమీటర్ల లోతులో వీ ఆకారంలో గాటుపెట్టి భూమి స్వభావాన్ని బట్టి ఐదు లేక ఆరు చోట్ల మట్టి నమూనాలను సేకరించాలని తెలిపారు. భూసార పరీక్షా కేంద్రం అధికారిణి రాధాదేవి, కవిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులను పొలాల్లోకి తీసుకొచ్చి మట్టి నమూనాల గురించి వివరించినట్లు తెలిపారు. రైతులు పొలం సాగుచేసే ముందు భూసార పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ సుబ్రమణ్యం, జవహర్ నవోదయ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి టౌన్ : విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదిలోని పిల్లలతో మాట్లాడారు. అనంతరం 10వ తరగతి పరీక్షల కోసం విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారనే విషయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. సిలబస్ పూర్తి చేసిన తరువాత విద్యార్థులతో పూర్తిస్థాయిలో ప్రశ్నాపత్రాల తీరుతెన్నులపై అవగాహన కల్పించాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ టెస్ట్ పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని చెప్పారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఉండేందుకు యోగా, ధ్యానం సాధన చేయాలన్నారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

గాలివీడు : త్వరలో పరీక్షలు రాయనున్న పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఏఎస్‌డబ్ల్యూఓ సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోందని, ప్రతి ఒక్కరు చదువుపై ధ్యాస ఉంచి, ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా వార్డెన్‌లు చొరవ తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో కచ్చితంగా ట్యూషన్లను ఏర్పాటు చేసి వార్డెన్‌లు పర్యవేక్షించాలన్నారు. అనంతరం వసతి గృహంలో అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్లు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగరాలకు దీటుగా రాయచోటి అభివృద్ధి

- 10 మాసాల్లోనే రూ.20 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి
- కొత్తపల్లె ప్రాంతం మరింత అభివృద్ధి
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సిమెంటు రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా రాయచోటి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మున్సిపాలిటీలోని 4, 5, 29 వార్డులలో రూ.70 లక్షలతో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభంలోనూ, 4వ వార్డులో రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమంలో ఆయన మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, స్థానిక కౌన్సిలర్లుతో కలసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేవలం 10 మాసాలలోనే గడప గడపకు మన ప్రభుత్వం, మున్సిపల్ జనరల్ నిధులు, 13వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో రూ. 20 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్నామన్నారు. ఇవేకాక ఇతర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. సుందరమైన రహదారుల నిర్మాణంతో రాయచోటి పట్టణానికి మరింత శోభ వచ్చిందన్నారు, కొత్తపల్లె ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పట్టణంలోని 20వ వార్డులో సుక్రుమియా వీధిలో రూ. 15లక్షలతో పూర్తయిన ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను, సీసీ రోడ్డు, ఆర్‌సీ కల్వర్ట్‌ల నిర్మాణాలను ఆయన స్థానిక కౌన్సిలర్ సాదక్ అలీతో కలసి ప్రారంభించారు. అలానే 4వ వార్డులో రూ.40 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. వీటితో పాటు మరో రూ. 40లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు కల్వర్టు పనులను ఆయన కౌన్సిలర్ కొలిమి హారూన్‌బాషాతో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. 5వ వార్డులోని బెంగళూరు డాక్టరు వీధిలో రూ. 15లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్ల ప్రారంభంలో స్థానిక కౌన్సిలర్ జబీవుల్లా, వైఎస్ఆర్‌సీపీ నేత రిజ్వాన్‌లతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పట్టణంలోని పలు మసీదులు, మదరసాలను సందర్శించారు. మైనార్టీ నేతలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పలు వీధులలో పర్యటిస్తూ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భాన్ని పురస్కరించుకుని ఆయా ప్రాంతాల కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భారీ జనసందోహం ఆయన వెంట నడిచారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ తబ్రేజ్‌ఖాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు మహమ్మద్‌ఖాన్, ఆసిఫ్అలీఖాన్, జాకీర్, రియాజ్, అల్తాఫ్, రౌనఖ్, గౌస్‌ఖాన్, రియాజుర్, నవరంగ్ నిస్సార్, సుగవాసి ఈశ్వర్, జానం రవీంద్ర, విజయభాస్కర్, మూసా, హజరత్ ఖాదర్‌వలీ, కొత్తపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రక్రియకు అడ్డుగా సాంకేతిక కారణాలు

లక్కిరెడ్డిపల్లె : అర్హత కల్గిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియ జీఓను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే హెల్త్ డిపార్టుమెంట్‌లో రెగ్యులర్ కోసం డేటా అప్‌లోడ్ అవుతున్నవి క్యాడర్ స్ట్రెంత్ క్లియర్‌గా ఉన్న వారివి మాత్రం అప్‌లోడ్ అవుతున్నవి, మిగతా వారివి క్యాడర్ స్ట్రెంత్ ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వలన అప్‌లోడ్ కావడం లేదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రామాపురం, నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్యాడర్ స్ట్రెంత్ ఆన్‌లైన్ చూపించడం లేదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల అర్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలంటే ఆన్‌లైన్ తీసుకోవడం లేదని వారు వాపోతున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్యాడర్ స్ట్రెంత్‌తో రెగ్యులర్ చేయాలని వారు కోరారు.


కార్పస్ ఫండ్ చెక్కు అందజేత

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందిన ఎస్. సత్యకుమార్ (పీసీ 226) కుటుంబానికి గురువారం రూ. 1లక్ష నగదు చెక్కును అందజేశామని కమాండెంటు పి.రవిశంకర్ తెలిపారు. కానిస్టేబుల్ సత్యకుమార్ ఇటీవల తుపాను విపత్తులో మరణించారన్నారు. ఆయనకు రావలసిన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ. 1లక్షకు సంబంధించిన చెక్కును ఆయన సతీమణి ఎస్.రాజీకి 11వ బెటాలియన్ కమాండెంటు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ విధి నిర్వహణలో చనిపోయినటువంటి పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి గులాం దస్తగిరి, ఆఫీసు సూపరింటెండెంట్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

సంబేపల్లె : నేడు శుక్రవారం జరగనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి రామచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 జాతీయ, కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలు 16న (శుక్రవారం) జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. భారత్ బంద్‌కు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్ కళాయాత్రతో శాస్త్రీయ దృక్పథం పెంపు



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్రనేత మురళీధర్‌రావు

రాయచోటి అర్బన్ : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకే సైన్స్ కళాయాత్రను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేతలు మురళీధర్‌రావు, త్రిమూర్తులు అన్నారు. గురువారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్ కళాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వినోద, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుంచి మొదలైన ఈ యాత్ర అనంతపురం జిల్లాలో ముగుస్తుందన్నారు. యాత్రలో 25 మంది కళాకారులు పాల్గొంటున్నారన్నారు. వారి చేత సైన్స్ నాటికలు, సైన్స్ పాటలు, మ్యాజిక్ షో, సైన్స్ ప్రయోగాలు మొదలైన అంశాలు ప్రదర్శితం అవుతాయన్నారు. కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రజల్లోని మూఢ నమ్మకాలను తొలగించేందుకు కృషి చేస్తోందంటూ అభినందించారు. మానవత రాష్ట్రనేత సహదేవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటల ద్వారా విజ్ఞానాన్ని కలిగించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. 25 మంది కళాకారులు చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లయన్ హరినాథరెడ్డి, జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమచరణ్, ప్రకాష్‌రెడ్డి, నేతలు ఆంజనేయులు, శేషారెడ్డి, వినయ్‌కుమార్, ప్రజా నాట్యమండలి సభ్యులు, సాయి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.